

2026 అక్టోబర్ వరకూ ఏక్తా దివస్ వేడుకలు

ప్రజాశక్తి-కాకినాడ

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా భారత ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను అక్టోబర్ 2025 నుంచి అక్టోబర్ 2026 వరకూ నిర్వహిస్తామని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో 15-29 ఏళ్ల యువతను భాగస్వామ్యం చేస్తూ ఈ నెల 17న 5 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. నవంబర్ 17న ఉదయం 10 గంటలకు కాకినాడ భానుగుడి జంక్షన్ నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకూ సాంబమూర్తి నగర్ లోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల వరకూ నిర్వహిస్తామన్నారు. పోలీస్ అధికారులు అవసరమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని ఆయన ఆదేశించారు.

ప్రజలపై ధరల తుపాను

- మొంథాతో తగ్గిన దిగుబడులు
- ఆకాశాన్నంటిన కూరగాయల రేట్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

నిత్యావసర సరుకుల ధరల విపరీతంగా పెరిగి పోతుండడంతో పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే అన్ని రకాల పప్పులు, ఆయిల్, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెరిగి సామాన్యుల నడ్డి విరిచాయి. ఇప్పుడు కూరగాయల ధరలు ఆకాశాన్నంటి దిగనంటున్నాయి. ప్రధానంగా ఇటీవల మొంథా తుపాను వచ్చి ఉద్యాన పంటలను నాశనం చేసింది. దానికి తోడు కార్తీక మాసం కావడంతో ధరలు ఎన్నడూ లేని విధంగా ధరలు పెరిగిపోయాయి. నెల రోజుల క్రితం నుంచి ఉన్న ధరలకు ఇప్పుడు ధరలకు చాలా వ్యత్యాసం కనిపిస్తోంది.

పెరిగిన ధరలు ఇలా...

వంకాయలు, దొండ, బెండ, కాకర, బీర, క్యారెట్, గోరుచిక్కుడు, బొబ్బర్లు ఇలా పలు కూరగాయలు కిలో రూ.25 నుంచి 35 ఉండేవి. కొన్ని రోజులుగా రూ.40 నుంచి రూ.60కి పెరిగాయి. చిక్కుళ్లు, ఆకాకర వంటి వాటి ధరలు గతంలో రూ.70 ఉంటే ఇప్పుడు రూ.110కి పైనే పెరిగింది. చిక్కుడు బీన్స్ కిలో రూ.200 పైనే అమ్ముతున్నారు. బంగాళాదుంపలు, టమోటా వంటి ధరలు సైతం వారం రోజుల నుంచి కాస్త స్వల్పంగా మరోసారి పెరిగాయని వ్యాపారులు తెలిపారు. ఉల్లిపాయల ధరలు నిలకడగానే ఉన్నప్పటికీ రాబోయే రోజుల్లో పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అరటి, కొత్తిమీర, తోటకూర ధరలు రూ.10 నుంచి 20కి పెరిగాయి.

వర్షాలతో కుళ్లిన పంటలు

నెల రోజుల క్రితం కురిసిన వర్షాలతో పాటు ఇటీవల వచ్చిన తుపాను వల్ల కూడా కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. రోజుల తరబడి వర్షం నీరు నిల్వ ఉండిపోవడం వల్ల పలుచోట్ల పంటలు కుళ్లిపోయిన పరిస్థితి ఏర్పడింది. గొల్లప్రోలు, తుని, పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి ప్రాంతాల్లో ఈ పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతు బజార్లతో పాటు హోల్‌సేల్ మార్కెట్లకు వచ్చే కూరగాయలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. దీనికి తోడు ఈ నెల అంతా పలువురు మాంసాహారాలకు దూరంగా ఉంటారు. కార్తీకమాసం కావడంతో ఎక్కువమంది పూజలు చేస్తూ దేవాలయాలకు తిరుగుతుంటారు. ఈ నేపథ్యంలో అంతా శాఖాహారంపైనే ఆధారపడ్డారు. దీంతో కూరగాయలకు డిమాండ్ బాగా పెరిగింది. దిగుబడులు భారీగా తగ్గిపోవడంతో ఈ పంటలు పండించే రైతులు తీవ్రస్థాయిలో నష్టపోయారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టగా తుపాను వచ్చి అంతా తుడిచి పెట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపరిహారం విషయంలో నిబంధనల వలల అన్యాయం జరుగుతుందంటూ పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం ఎండలు కాస్తున్నప్పటికీ మిగిలి ఉన్న కొంత పంటలో అక్కడక్కడ కాసిన కూరగాయలను విక్రయించుకుంటున్నామని రైతులు తెలిపారు.



గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో తుపాను ప్రభావంతో నేలకొరిగిన దొండ పంట

రైతు బజార్లలోనూ మండుతున్న ధరలు

కాకినాడలో రెండు పెద్దాపురంలో ఒకటి రైతు బజార్లు ఉండగా కూరగాయల ధరలు అందుబాటులో ఉండడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. గతంలో ప్రతి రోజూ 20 నుంచి 23 టన్నుల కూరగాయలు ఈ రైతు బజార్లలో విక్రయించేవారు. కానీ తుపాన్లు, వర్షాల తర్వాత 15 టన్నులకు మించి కూరగాయలు విక్రయాలు జరగడం లేదని రైతు బజార్ల నిర్వాహకులు తెలిపారు. దీంతో రైతు బజార్లలో సైతం ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పట్టికలో ప్రకటిస్తున్న ధరలకు రైతులు విక్రయిస్తున్న ధరలకు భారీ వ్యత్యాసం కనిపిస్తుండడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పలుమార్లు రైతు బజార్ల నిర్వహకులకు, వినియోగదారులకు వాగ్వివాదాలు జరుగుతున్నాయి. హోల్‌సేల్ ధరలకంటే ఎక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్న నేపథ్యంలో అధికారులకు ఫిర్యాదులు కూడా ఇటీవల వినియోగదారుల నుంచి వెళ్లాయి. ఈ నేపథ్యంలో కూరగాయల ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులో ఉంచే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం, గొల్లప్రోలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక లారీ వర్కర్స్ కార్యాలయం వద్ద ఆయన ఈ నెల 20న చలో కలెక్టరేట్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మాణరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు నిలుపుదల చేస్తూ 1214 మెమోను తీసుకొచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, కార్మికులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ రంగ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి నిర్మాణరంగ కార్మికులకు 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వాలని, ఇంటి రుణాలను విడుదల చేయాలని, ఉపాధి కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ఈనెల 20న జరిగే తన కార్మికుల పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల వర్కింగ్ కమిటీ కో కన్వీనర్ ఉప్పలపు విజయ్ కుమార్, పాకలపాటి సోమరాజు, పిల్ల రాంబాబు, లింగంపల్లి నాగేశ్వరరావు, గుండుబిల్లి చక్రం, బి.వీరబాబు, సిహెచ్.రాజులమ్మ, జి.లక్ష్మి, జి.అప్పలరాజు ఉన్నారు.



ఏలేశ్వరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గొల్లప్రోలు భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 20 చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికుల జిల్లా కోశాధికారి ఒరుగంటి నందీశ్వరుడు పిలుపునిచ్చారు చేబ్రోలు గ్రామం గుడి సెంటర్లో నందీశ్వరుడుతో కలిసి చలో కలెక్టరేట్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.రమణ, టి.రవిబాబు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బిజెపి నేతల ఆగడాలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-కాకినాడ

దేశభక్తి పేరుతో ప్రజలను విభజించే ఎత్తుగడలు వేస్తున్న బిజెపి నాయకుల ఆగడాలను నగర ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది. మతసామరస్యాన్ని నిలబెట్టే విధంగా వ్యవహరించిన నగరపాలక సంస్థ అధికారులకు సిపిఎం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నగర కన్వీనర్ పలివెల వీరబాబు శనివారం గాంధీనగర్ పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు. 1923లో కాకినాడలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు అధ్యక్షత వహించిన మహ్మద్ ఆలీ పేరు మీద గాంధీ నగర్ పార్క్ దక్షిణం రోడ్ గత చాలా కాలంగా వాడుకలో ఉందన్నారు. ఇటీవల వందేమాతరం పేరుతో కొంతమంది బిజెపి నాయకులు మహ్మద్ ఆలీ పేరుతో ఉన్న బోర్డ్‌ను తొలగించి, వందేమాతరం మార్గ్ అనే బోర్డు ఏర్పాటు చేయడం సమంజసంగా లేదన్నారు. బిజెపిని నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ పుట్టకముందే కాకినాడలో జాతీయ కాంగ్రెస్ మహాసభలు జరిగాయన్నారు. దేశభక్తికి, స్వాతంత్రోద్యమ స్ఫూర్తికి కాకినాడ కీలకంగా ఉందన్నారు. బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి, మత సామరస్యానికి విఘాతం కలిగించే చర్యలను అరికట్టిన నగర పాలక సంస్థ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కోనేటి సూరిబాబు మృతికి సంతాపం

ప్రజాశక్తి-పిఠాపురం

సిపిఎం సీనియర్ నాయకుడు కోనేటి రాజు చిన్న కుమారుడు కోనేటి సూరిబాబు (43) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, డి.శేషబాబ్జి, కెఎస్.శ్రీనివాస్, పలివెల వీరబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి క్రాంతి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.రమణి, మండల కన్వీనర్ కుంచే చిన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సింహాచలం, యు.కొత్తపల్లి మండలం సిఐటియు నాయకులు కెవివి.సత్యనారాయణ, కాళ్ల నాగేశ్వరరావు, సాంబశివ, ఎస్.శ్రీనివాస్, సిఐటియు నాయకులు కరణం విశ్వనాథం, పి.సూర్యచక్రం, రజక సంఘం నాయకులు కె.నాగేశ్వరరావు, ఎస్.రాజేష్, అప్పన సూర్యనారాయణ, ఎస్‌పి శ్రీకాంత్, కొండేపూడి శంకరరావు సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు



సమావేశంలో పాల్గొన్న యనమల రామకృష్ణుడు

ఛాంబర్ కార్యవర్గం ఎన్నికకు కసరత్తు

ప్రజాశక్తి-కోటనందూరు

తుని పట్టణంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ఏర్పాటుకు శనివారం టిడిపి కార్యాలయంలో పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు వర్తకులతో సమావేశం నిర్వహించారు. వర్తకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రామకృష్ణుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తుని పట్టణంలోని వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రభుత్వపరంగా వ్యాపార కార్యకలాపాలకు పూర్తిగా సహకార సహకరిస్తామన్నారు. గతంలో మాదిరిగానే రౌడీయిజం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్‌బాబు, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు పెనుగొండ కామరాజు, టిడిపి నేతలు చింతంనీడి అబ్బాయి, ఇనుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి సత్యనారాయణ, సూరంపూడి చంద్రశేఖర్, నార్ల రత్నాజీ, పివిజి.గుప్తా, తటవర్తి రాజా, కారుమూరి భద్రరావు, దర్శి మోహన్ కృష్ణ, మద్దుల శ్రీను పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సంయుక్తంగా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు రైలు ప్రయాణికులకు బాలల హక్కుల ప్రాముఖ్యతను వివరిస్తూ మాట్లాడారు. ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుంచి 20 వరకూ దేశవ్యాప్తంగా అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, బాలల సంక్షేమం కోసం ప్రతి పౌరుడూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరుగడం అత్యంత ముఖ్యమని, వారికి జీవించే హక్కు, రక్షణ హక్కు, అభివృద్ధి హక్కులను సమర్థంగా పరిరక్షించినప్పుడే వారి భవిష్యత్తు దేదీప్యమానమవుతుందని తెలిపారు. పిల్లలపై దాడులు, అక్రమ రవాణా, భిక్షాటన, రైలులో సర్కస్ చేయించడం వంటివి గమనిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఫిర్యాదు చేయాలని కోరారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి దత్తతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ వి.వరప్రసాద్, శిశు గృహ ఇన్‌ఛార్జి రేవతి, సోషల్ వర్కర్ చినబాబు, చైల్డ్ హెల్ప్‌లైన్ కేసు వర్కర్ లక్ష్మి, నర్స్ దేవి, దుర్గాభవాని, బి.కుమారి పాల్గొన్నారు.



బాలల హక్కులపై నిర్వహించిన అవగాహనా ర్యాలీ



నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు

ఎపిఎన్‌జిజిఒ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం యూనిట్ ఎపిఎన్‌జిజిఒ అధ్యక్షునిగా డిప్యూటీ ఎంపిడిఒ ఎంవి.రామరాజు వర్మ ఎన్నికయ్యారు. ఒక్కొక్క పదవికి ఒక్కొక నామినేషన్ రావడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి శ్రీకృష్ణ ప్రకటించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శనివారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. సహాధ్యక్షునిగా విఆర్ఒ అవసరాల తిరుమలరావు, ఉపాధ్యక్షునిగా ఎస్.శేషు రాజు, బి.శ్రీహరియాదవ్, ఎస్.పొన్నాలు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా బిజెకె.బాలాజీ, సిహెచ్.కుమార్ రాజు, పి.సురేష్ కుమార్, మహిళా కార్యదర్శిగా ఎస్.విజయలక్ష్మి, కోశాధికారిగా డాక్టర్ ఆర్.సత్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. సహాయ ఎన్నికల అధికారిగా పి.సురేష్, పర్యవేక్షణాధికారిగా టి.చార్లెస్ పాల్ వ్యవహరించారు. ఎన్నికైన కమిటీని జిల్లా అధ్యక్షుడు గూదేటి రామ్మోహన్, కార్యదర్శి పాలపర్తి మూర్తిబాబు, ఉపాధ్యక్షుడు నరెళ్ల చంద్రరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కె.ప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శి వై.రామకృష్ణ అభినందించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని మేధో సంపన్నులను చేసేవి పుస్తకాలు మాత్రమేనని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి అన్నారు. 58 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కాకినాడ వివేకానంద్ పార్కులోని గాంధీ నగర్ శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, వై.సత్యనారాయణమూర్తి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాకినాడలో పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ఆర్‌జెడి

సామర్లకోట ఎంఇఒ వై.రామకృష్ణయ్య స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బందిల రత్నమణి, యార్లగడ్డ రాజేష్, కొల్లి పెద్దిరాజు, కొమ్ము శివశంకర్ ప్రసాద్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంఇఒ

పిఠాపురం పాడా కార్యాలయ విజన్ ప్లానర్ సిహెచ్.శివసాయి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రాంబాబు గ్రంథాలయాధికారి ఆర్.వెంకట రాము పాల్గొన్నారు.

కరప వేళంగి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి పివి.రంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వేళంగి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వాణి, సుబ్బారెడ్డి, సుజాత, విజయదుర్గ, కె.రాంబాబు, విక్రం పాల్గొన్నారు.

ఎంపిడిఒగా లక్ష్మి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎంపిడిఒగా వైవివి ఎన్ఎస్.లక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎఒ ఎవిఎస్.చంద్రశేఖర్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆమె రాజానగరం డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఆమెకు మండల పరిషత్ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపిడిఒకు స్వాగతం పలికిన సిబ్బంది

శృంగార వల్లభునికి రూ.3.84 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.3,84,663 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,26,230, అన్నదానం విరాళాల ద్వారా రూ.1,25,747, కేశఖండన ద్వారా రూ.5,280, తులాభారం ద్వారా రూ.500, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.26,685, స్వామి వారి కానుకల ద్వారా రూ.221 లభించినట్టు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు. పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సేవలందించారన్నారు.

పదవులు అలంకారం కాదు.. బాధ్యత

ప్రజాశక్తి-గండేపల్లి

పదవులు అలంకారం కాదని.. దాన్ని బాధ్యతగా తీసుకుని టిడిపి ఆశయాలను క్రమశిక్షణతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు తీసుకువెళ్లాలని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పిలుపు ఇచ్చారు. మండల, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. జెడ్ రాగంపేట పంచాయతీలోని పరిణయ ఫంక్షన్ హాల్లో 2,632 మంది సభ్యుల చేత ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా ఎంఎల్‌సి పి.రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు ఎస్.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ, నవీన్ మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టను పరిరక్షించేందుకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నిత్య చైతన్యంతో పార్టీ భవిష్యత్తు కోసం కష్టపడిన వారికి తగిన విధంగా గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ బలం కార్యకర్తలేనని, గత పాలకులు ఎన్ని బెదిరింపులకు దౌర్జన్యాలకు గురిచేసినా కష్టసుఖాలను ఎదుర్కొని పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలకు పార్టీ గుర్తింపు ఇస్తోందన్నారు. తొలుత రావులమ్మ నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఎంఎల్ఎ నెహ్రూ ఆవిష్కరించారు. కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతుల మోహనానావు, జెడ్‌పిటిసి సభ్యుడు పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, మండల యువత అధ్యక్షుడు సుంకవల్లి రమేష్, శ్రీదేవి పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి -కరప

మండల కేంద్రమైన కరపలో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శనివారం వైసిపి నాయకులు సంతకాలు సేకరించారు. వైసిపి జెడ్‌పిటిసి, ఎంపిపి యాళ్ల సుబ్బారావు, పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్యాన్ని ప్రజల హక్కుగా చూడకుండా మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడానికి వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం చేపట్టిందని పార్టీ నాయకులు తెలిపారు. దీనిలో భాగంగా కరప గ్రామంలో సంతకాలు సేకరించి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పాట్నీడి భీమన్న, గోన శ్రీనివాస్, నక్కా సత్తిబాబు, ముద్రగడ నానాజీ, నక్కా భద్రం, మద్దూరి భాస్కర్, సాదే ఆశాజ్యోతి, సాదే లోహిదాస్, నాగల బాలాజీ, పాట్నీడి సూరిబాబు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించారని పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- తాళ్లరేవు

చొల్లంగి పంచాయతీలో తన తండ్రి మైదు సత్యారావు పేరున ఉన్న 15 సెంట్ల భూమిని పలువురు ఆక్రమిస్తున్నారని చొల్లంగి మాజీ సర్పంచ్ మైదు హరిబాబు కోరంగి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆ భూమిలో లేఅవుట్ నిర్మాణం కోసం పొక్లెయిన్ సాయంతో గ్రావెల్ వేస్తుండగా శనివారం ఆ పనులను అడ్డగించినట్టు హరిబాబు విలేకరులకు తెలిపారు. 2018 పూర్వమే ఆ భూమి తమ తండ్రి సత్యారావు పేరుపై 1బి పాస్‌బుక్ ఉందని తెలిపారు.


ఆదిత్య ప్రొఫెసర్ జానకీదేవికి డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్.జానకీదేవికి యుపిలోని జెఎస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్టు విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. సిహెచ్.జానకీదేవీ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, క్యాంపస్ డైరెక్టర్. డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ ఆదిరెడ్డి, డీన్ డాక్టర్ పిఎస్‌విివిఎస్‌ఆర్.కుమార్, డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు అభినందనలు తెలిపారు.



కార్టూ'నిజం'



పరిహారం ఎప్పటికి అందేనో..?

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మొంథా తుపాను ప్రభావంతో అన్నదాతలు ఆశలు అతలాకుతలమయ్యాయి. లక్షలాది ఎకరాల్లో పంటను కోల్పోయారు. నష్టం వాటిల్లి 20 రోజులైనా నేటికీ వారికి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. పంటనష్టపోయిన రైతన్నలు సర్కారు సాయం కోసం దీనంగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన పంటలు అక్షరాలా 1.74 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఆరుగాలం పండించిన రైతన్న కష్టం ఒక్కసారిగా ఆవిరైపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరించింది. తుపాను అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి పర్యటన తప్ప రైతులకు ఎటువంటి స్పష్టమైన భరోసా లభించలేదు. తుపాను అనంతరం ఎన్యూమరేషన్ ప్రక్రియపైనా పలు విమర్శలు వినిపించాయి. ఎన్యుమరేషన్ ప్రక్రియ మొక్కుబడిగా సాగిందని అన్నదాలు గగ్గోలు పెట్టారు. ఎన్యుమరేషన్ ప్రక్రియకు ముందే ఒకసారి పంట నష్టంలో లెక్కిస్తే ఆ ధాన్యం కొనుగోలు చేయబోమని అధికార యంత్రాంగ చెప్పడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు .33 శాతానికిపైగా పంట నష్టం జరిగితేనే నష్టం జాబితాలో చోటు దక్కింది. దీంతో రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగలేదు. కనీసం పంట నష్టం అయినా సకాలంలో అందించి ఆదుకుంటారని భావించిన అన్నదాతలకు నిరాసే ఎదురైంది. ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసి వారం రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా రైతాంగం సుమారు రూ.250 కోట్లకు పైగా నష్టపోయినట్లు అంచనా. కేంద్రం బృందం వచ్చి జిల్లాకు రెండు మూడు గ్రామాల్లో మాత్రం పర్యటించి వెళ్లిపోయింది. నష్టంపై ముఖ్యమంత్రితో మాట్లాడి నివేదిక అందిస్తామని మాత్రమే చెప్పింది. కొన్ని ప్రాంతాల రైతులకు కేంద్ర బృందం వచ్చినట్టు కూడా తెలీని పరిస్థితి. పలుచోట్ల అన్నదాతలు ఈ బృందానికి వినతిపత్రాలు అందించారు. కాని వాటిని పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కానరాలేదు.

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి సాగును కష్టాలు నీడలా వెను వెంటే ఉన్నాయి. తొలుత అకాల వర్షాలు, ఆపై యూరియా కష్టాలు చివరికి మోంథా తుఫానుతో రైతన్నను వెన్ను విరిచాయి. అయితే పై మూడు దశలలోనూ ప్రభుత్వం రైతులకు అండగా నిలబడకపోగా ప్రభుత్వ యంత్రాంగం భిన్నంగా వ్యవహరించిన తీరు ఆందోళనకు గురి చేసింది. యూరియా కొరత సమస్యను పరిష్కరించకపోగా రైతులు అధికంగా కొనుగోలు చేశారని, కొద్ది మంది వద్ద ఈ నిల్వలు అధికంగా ఉండటం, ఉద్దేశ పూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ చేసిన వాఖ్యలు పాలకుల చిత్తశుద్ధిని దర్పణం పట్టాయి. తాజాగా ధాన్యం కొనుగోలులోనూ నిర్లక్ష్యం వెంటాడుతోంది. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించటంతో రైతులను దళారులను ఆశ్రయించక తప్పలేదు. ప్రభుఏత్వం ప్రకటించిన మద్దతు ధరకు బస్తా రూ.400 నుంచి రూ.300 తక్కువకు వ్యాపారులు యదేచ్ఛగా కొనుగోలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా ప్రకటించిన హామీ సైతం నేటికీ ఆచరణలో అమలుకు నోచుకలేదు. తుపాను నేపథ్యంలో తేమ శాతం నిబంధనలను సడలిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి తక్షణమే పంటనష్ట పరిహారం అందజేయాలని రైతులు వేడుకుంటున్నారు.



మరోపక్క జిల్లాపై చలి పులి పంజాను విసిరింది. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకంటే తక్కువగా నమోదవుతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఫలితంగా ప్రజారోగ్యంపైనా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్ర ఆస్పత్రులకు తరలి వస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ ఆస్పత్రులతో పాటు అమలాపురం ఆస్పత్రిలోనూ రోగుల సంఖ్య పెరిగింది. చలి తీవ్రతతో హాస్టల్ విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం దుప్పట్లు కూడా లేకపోవడం, కొన్ని వసతి గృహాలకు తలుపులు, కిటికీలు లేకపోవడంతో చలికి వణుకుతూనే చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి.

నేరాలు ఘోరాలు



ఘటనా ప్రాంతంలో భాస్కరరావు మృతదేహం

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బాలాంత్రం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంపన భాస్కరరావు(60) మృతి చెందాడు. బాలాంత్రం నుంచి బైకుపై వస్తున్న విత్తనాల శివ, భాస్కరరావులను యానాం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో భాస్కరరావు ఘటనా స్థలంలో మృతి చెందాడు. గాయపడిన విత్తనాల శివను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి గొల్లప్రోలు

ఒక మహిళ అదృశ్యంపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని దుర్గాడ గ్రామానికి చెందిన ఉగ్గిరాల వీరబాబుకు తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన నాగ దుర్గ వెంకటలక్ష్మితో ఐదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి పిల్లలు లేరు. ఈ నెల 11న పనికి వెళ్లిన వీరబాబు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భార్య వెంకటలక్ష్మి కనిపించలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు చుట్టుపక్కల గ్రామాల్లో బంధుమిత్రులు ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకష్ణ తెలిపారు

8 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

కోరుకొండ ఎక్సైజ్ సిఐ శ్రీనివాస బాలాజీ ఆధ్వర్యంలో శనివారం బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. పురుషోత్తపట్నం కాలనీ బస్టాండ్ వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కటికల శ్రీనును అరెస్టు చేశారు. 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుని కోర్టులో హాజరు పరుస్తామని ఎక్సైజ్ సిఐ తెలిపారు.

హుండీల దొంగలకు రిమాండ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం, తాడిపర్రు రోడ్డులో, పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లోని హుండీల చోరీ కేసులో పిందితులు నక్కపల్లికి చెందిన అనుమాను శ్రీను, ఉండ్రాజవరానికి చెందిన మరో మైనర్‌ను ఉండ్రాజవరం ఎస్ఐ డి.రవికుమార్ అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, మైనర్‌ను జువైనల్ హోమ్‌కు తరలించారని ఎస్ఐ తెలిపారు.

యానాం సిఐ సస్పెన్షన్

ప్రజాశక్తి - యానాం

యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడలరసన్‌ను సస్పెండ్ చేస్తూ పుదుచ్చేరి ఐజి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పోక్సో కేసులో ఒక నిందితుని పుదుచ్చేరి తీసుకుని వెళ్లి తిరిగి వస్తుండగా వచ్చే దారిలో మద్యం తాగి డ్యాన్సులు చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఈ విషయం ఐజి అజిత్ కుమార్ దృష్టికి వెళ్లింది. దీంతో సిఐ అడలరసన్‌ను సస్పెండ్ చేస్తూ మాహే పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ వీడియోపై సిఐ అడలరసన్ స్పందిస్తూ మద్యం సేవించలేదని, డ్యూటీలో ఉన్న అయ్యప్ప స్వామి మాల వేసుకున్న కానిస్టేబుల్ తెచ్చుకున్న మజ్జిగను గ్లాస్‌లో వేసుకుని తాగుతూ డాన్స్ చేశానని వివరణ ఇచ్చారు.

662 ఉపాధి పనుల గుర్తింపు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద 662 పనులను గుర్తించామని, వీటి మంజూరుకు ప్రతిపాదనలు పంపామని ఎపిఒ సత్యవతి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామసభలను నిర్వహించామన్నారు. 373 పంట కాలువల నిర్మాణం, 162 సోక్ పిట్స్, 52 కంపోస్ట్ పిట్స్, 25 మట్టి రోడ్ల నిర్మాణం, 25 ఫారం పాండ్లు, 23 చెరువుల పనులు, 6 పండ్ల తోటలకు కందకాల తవ్వకం, 6 పండ్ల తోటల పెంపకం పనులను ప్రతిపాదించారు. అలాగే మునికూడలి, వెదుళ్లపల్లిలో ప్రత్యేక గ్రామసభలను ఎపిఒ బివి.సత్యవతి ఆధ్వర్యంలో మునికూడలి, వెదుళ్లపల్లి గ్రామ పంచాయతీల్లో ఉపాధి గుర్తింపు గ్రామసభలు జరిగాయి. కార్యక్రమాల్లో సర్పంచ్ ఆరుమిల్లి సత్యవతి, పంచాయతీ కార్యదర్శి విఠల్, సహకార సంఘం అధ్యక్షులు సానిపిని వెంకట రామారావు, వార్డు మెంబరు ఆరుమిల్లి సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనులకు అండగా ఉంటా'

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

గిరిజనులకు ఏ కష్టం వచ్చినా ఎంఎంఆర్ ట్రస్ట్ తరుపున ఆదుకుంటామని ట్రస్ట్ చైర్మన్, వైసిపి నర్సాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని బవురువాకకు చెందిన జర్త సింహాచలం ఇటీవల గాయపడటంతో ముదునూరి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సింహాచలానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, శేశెట్టి కోదండ, ఎంపిటిసి నానిపల్లి చంటి, బొల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలకు గ్యాస్ స్టవ్ అందజేత

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని వాదాలకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2కు 'మాదిగ యువజన సేవా సంఘం సభ్యులు రూ.5వేల విలువ చేసే గ్యాస్ స్టవ్‌ను శనివారం అందజేశారు. హెచ్ఎం ఇస్సాపురి కృష్ణయ్య మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు వంట చేసేందుకు ఈ స్టవ్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అయినపర్తి రవిశేఖర్, సెక్రటరీ బల్లి శ్రీను, సభ్యులు కాకినాడ మోహన్ రాజు, కొడమంచిలి రవితేజ, ప్రతిపాటి సూరజ్, తిగిరిపల్లి మధు, బి.చందు, వి.నవీన్, ఉపాధ్యాయులు, సిఆర్‌పి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మక్కకు మార్గాని కుటుంబంతో అనుబంధం

ప్రజాశక్తి-కడియం

'భారతదేశ తల్లి తెన్నె' (మదర్ ఆఫ్ ట్రీ)గా పిలువబడే కర్ణాటకకు చెందిన ప్రసిద్ధ పర్యావరణ కార్యకర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత సాలుమరద తిమ్మక్క శుక్రవారం మృతి చెందారు. 114 ఏళ్ల ఆమె దశాబ్దాల నుంచి వేలాది మొక్కలు నాటుతూ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొక్కలనే పిల్లలుగా చూసుకుంటూ రోడ్ల పక్కన మొక్కలు నాటుతూ వాటిని పెంచి పోషించి చెట్లుగా మార్చారు. ఆమె కృషికి పలు జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకుఆన్నరు. ఆమె సేవా కార్యక్రమాలను పాఠ్యపుస్తకంలో ప్రచురించారు. తిమ్మక్కకు కడియం గౌతమి నర్సరీ యువ రైతు మార్గాని వెంకట శేషు కుటుంబంతో మంచి సంబంధాలున్నాయి. 2019లో తిమ్మక్కకు పర్యావరణంకు సంబంధించి పద్మశ్రీ అవార్డు వచ్చింది. శేషు ఆమె ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పర్యావరణానికి సంబంధించి పద్మశ్రీ అవార్డు తీసుకున్న వాళ్లందర్నీ కలవడం ఈ యువకుడుని అలవాటుగా మారింది. అలాగే శేషు తల్లి సత్య కొత్త రకం మొక్కలను ఉత్పత్తి చేయడం విశేష గుర్తింపు పొందారు. సత్య కృషి కూడా తిమ్మక్కను విశేషంగా ఆకట్టుకుంది. పలుసార్లు కుటుంబ సభ్యులతో సహా తిమ్మక్కను కలుసుకున్నారు. కాల క్రమేణా మరింత దగ్గరయ్యారు.




తిమ్మక్కకు మొక్కను అందిస్తున్న శివ(ఫైల్)

ప్రతి ఏటా కర్ణాటక ప్రభుత్వం జాతీయ స్థాయిలో తిమ్మక్క పేరున పర్యావరణ అవార్డులు ఇస్తూ ఉంటారు. 2022లో సత్యకు అవార్డు ఇవ్వాలని తిమ్మక్క రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై,తిమ్మక్కల చేతుల మీదుగా సత్య అవార్డును అందుకున్నారు. తిమ్మక్క అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న శేషు కుటుంబం ఆర్థిక సహాయం చేసి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేసింది. తిమ్మక్క మతి తమను ఎంతో కలిచివేసిందని గౌతమి నర్సరీ రైతులు మార్గాని వీరబాబు, సత్య, శేషులు తెలిపారు.

సచివాలయాల్లో కానరాని కార్యదర్శులు

ప్రజాశక్తి - రాజానగరం

ప్రజలకు అందుబాటులో ఉండడానికి ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. కాని ప్రస్తుతం ఏ సచివాలయంలోనూ కార్యదర్శులు అందు బాటులో ఉండట్లేదు. దీంతో ఇవి నిరుప యోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో 34 గ్రామాల్లో సచివాలయాలు ఉన్నాయి. సచివాలయం పరిధిలో పారిశుధ్యం, తాగు నీటి సరఫరా, రోడ్ల తదితర పనుల పర్యవేక్షణలో కార్యదర్శులదే ప్రధాన పాత్ర. మండలంలో రాజానగరం, తోకాడ, కానవరం, మల్లంపూడి, పాలచర్ల, పుణ్యక్షేత్రం, దివాన్ చెరువు, తూర్పు గానుగూడెం, వెలుగుబంద, హౌసింగ్ బోర్డు, పుణ్యక్షేత్రం తదితర కార్యదర్శులు కేంద్రాలకు దూరంగా పట్టణాల్లో నివాసం ఉంటూ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాలకు ప్రభుత్వ పింఛన్లు ఇచ్చే సమయంలో అంటే నెలలో మెదటి రెండు రోజులు మాత్రమే వారు కనిపిస్తున్నారని, మిగిలిన సమయాల్లో కనిపించట్లేదని ప్రజలు గగ్గోలు పెడుతు న్నారు. కాని ప్రతి రోజూ మాత్రం కార్యాలయాల్లో విధులకు హాజరైనట్టు రికార్డుల్లో నమోదై ఉంటుంది. సమస్యలు చెప్పుకునేందుకు కార్యాలయానికి వెళితే కార్యదర్శులు కలెక్టర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో సమావేశాల్లో ఉన్నారని సిబ్బంది చెబుతున్నారు. సిబ్బంది జీతాలు, గ్రామాల్లో పనులకు సంతకాల కోసం ఇంటికి పిలుపించుకుని సంతకాలు చేసి పంపిన ఘటనలు కోకొల్లలు. కొన్ని సచివాలయాలు అయితే మధ్యాహ్నం 3 గంటలకే మూతబడు తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో సచివా లయం ఉద్యోగులు విధులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

దువ్వూరి త్యాగం నేటి తరానికి తెలియాలి

ప్రజాశక్తి-కడియం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరి సుబ్బమ్మ త్యాగం నేటి తరానికి తెలియాలని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. శనివారం కడియంలో దువ్వూరి సుబ్బమ్మ 145వ జయంతిని చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ఎంపిపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దువ్వూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిపి ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో జైలుకు వెళ్లిన తొలి తెలుగు మహిళ దువ్వూరి కడియం గ్రామస్తురాలు కావడం గర్వకారణమన్నారు. బ్రిటిష్ బలగాకు ఎదురొడ్డి పోరాడిన దీశాలి సుబ్బమ్మ అన్నారు. అందుకే ఆమెను గాంధీ దేశ బాంధవిగా పిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, తోరాటి వసంతరావు, బోనం సత్యనారాయణ, దేవవరపు నీలకంఠరావు, బొర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి

ప్రజాశక్తి పెదపూడి

నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెదపూడిలో రూ.50 లక్షలతో నిర్మించే మండల రెవెన్యూ కార్యాలయానికి ఎంఎల్ఎ నల్లమిల్లి, రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరమణ చౌదరి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నల్లమిల్లి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, వంటి మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పాణింగపల్లి సీతాపతిరావు, ఎఎంసి చైర్మన్ జుత్తుక సూర్యకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, సానా శ్రీనివాసు, టిబిరిశెట్టి గణేష్, గండ్రేడు విఆర్ఒ ఏడుకొండలు, చిలకమ్మ పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్రపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, కరప

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన పెంచాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశుభ్రత ద్వారానే ప్రజారోగ్యం బాగు పడుతోందన్నారు. మున్సిపల్ డిఇ డిఎస్ ప్రకాశరావు మాట్లాడారు. అనంతరం మున్సిపల్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఒలు నర్గీస్, శ్రీదేవి, పాల్గొన్నారు.కరప గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ సలాది వెంకట శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. దుర్గ గుడి సెంటర్లో మానవహారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలా దేవి పాల్గొన్నారు.

పలువురికి జెడ్‌పిటిసి సాగర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాళ్లరేవు

జెడ్‌పిటిసి సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ శనివారం పటవలలోని రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న బొడ్డు రాంబాబును పరామర్శించి బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు.కిడ్నీ స్టోన్స్, నడుము నొప్పితో బాధపడుతున్న రాయుడు ప్రసాద్‌ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, ఉప సర్పంచ్ చెక్కా లక్ష్మణ్, నేల శ్రీనివాస్ ఉన్నారు.

ఎపిఎన్‌జిఒ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జగ్గంపేట యూనిట్‌కు జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా టివి.సత్యనారాయణ, వి.క్రాంతికుమార్, సరెళ్ల చంద్రరావు వ్యవహరించారు. పిట్టా ప్రభాకర్‌ను యూనిట్ అధ్యక్షునిగా అసోషియేట్ అధ్యక్షులుగా ఎ.చల్లారావు, ఎల్.నాగేశ్వరరావులు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.పారా పాల్ కుమార్, కె.రాజరత్నం, సెక్రటరీలుగా ఎం.సునీల్ కుమార్, పి.గణేష్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.బాబ్జి, ఎన్ఎస్‌జి.ప్రసన్న కృష్ణ, మహిళా జాయింట్ సెక్రటరీగా పి.రోజా, కోశాధికారిగా సిహెచ్.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

ఘనంగా కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-పెద్దాపురం, తాళ్లరేవు

పాండవ గిరి పెయింటర్స్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌బి.కొత్తూరులో పామాయిల్ తోటలో శనివారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గడపా భద్రరావు, చావలి చందు, కరణం అప్పారావు, కొప్పుల శేఖర్, యాసలపు మహేష్, పి.రమేష్, పల్లా శివ, వల్లపు సూరిబాబు, నీలం శ్రీను, వాసూరావు, ఎండి ఆలీ, కంపర వీరబాబు, గొల్ల భద్రరావు, నీలం ఉదయ్‌కుమార్, కడియాల రామకృష్ణ, జి.రాజు, తోటరాజు, అర్జున్ పాల్గొన్నారు.

తాళ్లరేవు శివాలయంలో అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో శనివారం కార్తీక సమారాధన ఘనంగా నిర్వహించారు. పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, బొడ్డు సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

హైవేలో ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు

ప్రజాశక్తి - జగ్గంపేట

జాతీయ రహదారిపై ఉన్న బ్లాక్ స్పాట్‌లను ఎఆర్ ఎఎస్‌పి ఎస్.శ్రీనివాసరావు, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్‌తో కలిసి శనివారం పరిశీలించారు. కిర్లంపూడి మండలం సోమవరం నుంచి గండేపల్లి మురారి వరకూ ఉన్న 27.2 కిలోమీటర్ల 216 హైవేను పరిశీలించి 20 బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాటిని గుర్తించినట్టు సిఐ తెలిపారు. ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో ఎఎస్‌పి తెలుసుకున్నారని, వాటి నివారణకు త్వరలో చర్యలు తీసుకుంటారని పోలీసులు తెలిపారు.



వడ్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని వడ్లూరు సర్పంచ్ రఘుమండ తేజశ్రీ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వడ్లూరు సంపద తయారీ కేంద్రం వద్ద నిర్వహించిన సమాజ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పాటించాల్సిన శుభ్రత, నియమాలు, అలవాట్లు, శాస్త్రీయ పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఆంజనేయశర్మ, మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి టి.రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ చినపోసియ్య, తహశీల్దార్ శ్రీనివాస్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలం వంగలపూడి, సింగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్ సంగన చినపోసియ్య, సొసైటీ చైర్మన్ మద్దిపాటి సుజీరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ధాన్యాన్ని తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా శుభ్రం చేసి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ గౌరీదేవి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెరుకుమిల్లిలో భూసమస్యలపై గ్రామసభ

ప్రజాశక్తి-గోపాలపురం

గతంలో రీసర్వే పూర్తి చేసిన చెరుకుమిల్లిలో జాయింట్ ఎల్‌పిఎంఎస్(భూ సమస్యలపై) శనివారం గ్రామసభ నిర్వహించామని రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పివి.సాంబశివరావు తెలిపారు. గ్రామ పరిధిలో మొత్తం 2,827 ఎకరాల్లో రీసర్వే చేశామన్నారు. సుమారు 16 మందికి సంబంధించి భూ సమస్యలు, జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సుమారు ఆరుగురికి సంబంధించి భూ సమస్యలు పరిష్కరించామన్నారు. మండలంలో 19 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 10 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ కాంతారావు సర్వేయర్లు అభిరాజ్, ప్రతాప్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.